క్లుప్తంగా

వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ



కొల్లూరు: వరదల కారణంగా నిరాశ్రయులైన బాధిత కుటుంబాలకు స్వచ్ఛంద సంస్థల సాయం కొనసాగుతుంది. మండలంలోని జువ్వలపాలెంలో మంగళవారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో బియ్యం, కందిపప్పు, గోదుమపిండి, వంట నూనె వంటి పదిరకాల నిత్యావసర సరకులను వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరద బాధిత కుటుంబాలకు స్వచ్ఛంద సంస్థలు సాయం అందించడం ముదవాహం అని కొనియాడారు. టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, డీబీఆర్‌సీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

పాస్టర్ల కుటుంబాలకు..



భట్టిప్రోలు: భట్టిప్రోలు బేతేలు ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లోని 8 వరద ప్రభావిత గ్రామాల్లోని 40 మంది పాస్టర్ల కుటుంబాలకు 8 రకాల నిత్యావసర వస్తువులు, దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కొనకాల అబ్రహం మాట్లాడుతూ ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో దైవ సేవకులను ఆదుకునేందుకు తమ వంతు సహాయం చేసేందుకు ముందుకు వచ్చినట్లు కార్యక్రమంలో పాస్టర్లు జక్రయ్య బాబు, ఆనందరావు, దాసరి డేవిడ్ విల్సన్, పురం వెంకటేష్, చిట్టిబాబు, డానియేల్, తదితరులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం



రేపల్లె రూరల్: అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమైన సంఘటన పట్టణంలోని 24వ వార్డులో చోటు చేసుకుంది. అగ్నిమాపక శాఖ అధికారి సాంబశివరావు వివరాల మేరకు నేతాజీనగర్‌లో షేక్ కరిముల్లాకు చెందిన పూరింటికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నిప్పురవ్వలు ఎగసిపడటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో పూరిల్లు పూర్తిగా దగ్ధమై గృహంలోని వస్తువులన్నీ అగ్నికి ఆహుతయ్యాయన్నారు. స్థానికుల సమాచారంతో తమ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశామని సాంబశివరావు తెలిపారు. ప్రమాదంలో రూ.50వేల ఆస్తినష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో పంటనష్టం జాబితాలు



అమర్తలూరు(వేమూరు): పంటనష్టం జాబితాలను రైతు సేవా కేంద్రాలు, గ్రామ సచివాలయాల వద్ద ఏర్పాటు చేయడం జరిగిందని మండల వ్యవసాయాధికారి లోకేశ్వరి తెలిపారు. అమర్తలూరు మండలంలో వర్షాల వల్ల దెబ్బతిన వరి పొలాలను గుర్తించడం జరిగిందన్నారు. పంట నష్టపోయిన రైతులు, కౌలు రైతుల వివరాలు సామాజిక తనిఖీ నిమిత్తం ప్రదర్శించడం జరిగిందన్నారు. అభ్యంతరాలను స్వీకరించడం జరుగుతుందని ఆమె తెలిపారు.

విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయుడి చేయూత

వరద ప్రభావిత గ్రామాల్లోని విద్యార్థులు 70 మందికి నోట్ పుస్తకాలు, స్టేషనరీ అందజేత



భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలంలోని వరద ప్రభావిత గ్రామాలైన చింతమోటు, పెదలంక, పెసర్లంక, ఓలేరు పల్లెపాలెం గ్రామాలలోని మండ పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న 70 మంది విద్యార్థులకు మంగళవారం విశ్రాంత ఉపాధ్యాయుడు బొలిశెట్టి శ్రీనివాసరావు నోట్ పుస్తకాలు, స్టేషనరీ అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.సురేష్‌కుమార్, పి.శేఖర్‌బాబు, టి.శ్రీనివాసరావు, వి.సత్యన్నారాయణ, శనగపల్లి నరసింహారావు, శ్రీనివాసరావు, మిత్ర బృందం, పసుపులేటి శివరామప్రసాద్, ఎస్ఎస్‌పీ గుప్తా, కేఎస్‌పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యవంతమైన సమాజం

- మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ
- పలు ప్రాంతాల్లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు



రేపల్లెలో స్వచ్ఛతా హీ సేవ ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ, తదితరులు

రేపల్లె రూరల్: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. స్వచ్ఛభారత్ లక్ష్యంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవ ప్రతిజ్ఞ చేశారు. ఓల్డ్‌టౌన్‌లో రహదారులను పరిశుభ్రం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు, వైస్ చైర్మన్ తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

కర్లపాలెంలో...

కర్లపాలెం: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తహసీల్దార్ వెంకటరత్నం తెలిపారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా కర్లపాలెం మండల పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం అధికారులు ప్రజా ప్రతినిధులు విద్యార్థులతో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. తొలుత మండల పరిషత్ కార్యాలయం వద్ద మానవహారంగా నిలబడి ప్రతిజ్ఞ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, కర్లపాలెం సర్పంచ్ నక్కా లలితకుమారి, ఎంపీటీసీ సభ్యులు తాండ్ర సాంబశివరావు, గొర్ల కమల, రాతంశెట్టి లక్ష్మణరావు, అమీర్‌బేగ్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిజాంపట్నంలో...

నిజాంపట్నం: చుట్టూ ఉన్న పరిసరాలను ప్రతి ఒక్కరూ శుభ్రంగా ఉంచుకోవాలని జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ నాగలక్ష్మీ అధ్యక్షతన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. నర్రా సుబ్బయ్య మాట్లాడుతూ పరిసరాల శుభ్రతలో భాగంగా తాగునీరు విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వ్యర్థాల గురించి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో ప్రతిజ్ఞ చేసి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. టీడీపీ నాయకుడు బొమ్మిడి రామకృష్ణ, నాయుడు గోపీ, లంకె మీరయ్య, పీతా సాయిబాబు పాల్గొన్నారు.

చుండూరులో..

చుండూరు(వేమూరు): పారిశుద్ధ్యంపై ప్రతి గ్రామ పంచాయతీలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీడీవో సుగుణమ్మ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబరు 2 వరకు అన్ని గ్రామ పంచాయతీల్లో పలు కార్యక్రమాలు చేపట్టడం జరుగుతందన్నారు. ఎంపీపీ జాలాది రూబేను, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేమూరులో...

వేమూరు: గ్రామీణ ప్రాంతాల్లో పరిసరాల పరిశుభ్రత నిమిత్తం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ అనురాధ తెలిపారు. వేమూరు మండల కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 17 వ తేదీ నుంచి అక్టోబరు 2 వరకు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. జొన్నలగడ్డ విజయబాబు, పంచాయతీ విస్తరణాధికారి చొప్పర శేఖర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పిట్టలవానిపాలెంలో...

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని పిట్టలవానిపాలెం ఎంపీడీఓ మారుతీ శేషమాంబ తెలిపారు. పిట్టలవానిపాలెం గ్రామ సచివాలయం వద్ద జరిగిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ మేరకు అన్ని గ్రామ పంచాయతీలలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. సర్పంచ్ బొలగాని అరుణకుమారి, ఇన్‌చార్జ్ ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు, గ్రామ పంచాయతీ కార్యదర్శి శివకుమార్, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థుల మానవహారం



వెల్లటూరులో స్వచ్ఛతా హి సేవా- 2024 కార్యక్రమంలో భాగంగా మానవహారం ఏర్పాటు చేసిన విద్యార్థులు

భట్టిప్రోలు: స్వచ్ఛతా హి సేవా- 2024 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి కోరారు. మంగళవారం భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. వెల్లటూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు మానవహారం ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖర్, ఈవోపీఆర్డీ టి.ఉషారాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎన్.శివకృష్ణ, ఎంఈఓ నీలం దేవరాజు, ఎంపీటీసీ సభ్యులు దారావత్ కుమారీ భాయ్, వాకా వెంకట నారాయణ, పంచాయతీ ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ జె.వెంకటరమణమ్మ, ఫజురున్నీస్సా పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

రేపల్లె రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు అన్నారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సూర్యుని నుంచి వెలువడే అతినీల లోహిత కిరణాలతో ప్రమాదం పొంచి ఉందన్నారు. ఈ కిరణాలు మానవ శరీరంపై నేరుగా పడితే చర్మ సంబంధిత వ్యాధులతో పాటు అనేక రుగ్మతలు ఏర్పడతాయని చెప్పారు. అతినీల లోహిత కిరణాల నుంచి ఓజోన్ పొర సృష్టిని కాపాడుతోందని, అటువంటి ఓజోన్ పొరను కాపాడుకోవాలని చెప్పారు. అధ్యాపకులు డాక్టర్ నరసయ్య, వీవీ రవీంద్ర, బాల గురవయ్య, తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసం పంపిణీ



కొల్లూరు: కృష్ణా వరదలతో అతలాకుతలమైన లంక గ్రామాల ప్రజలను ఆదుకోవడానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కారుమూరు వెంకటరెడ్డి ముందుకొచ్చి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. మంగళవారం మండలంలోని జువ్వలపాలెంలో గ్రాసం లేక ఇబ్బందులు పడుతున్న పశువులకు తనవంతు సాయంగా గ్రామంలోని పశుపోషకులకు గ్రాసం పంపిణీ చేశారు. వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు సూచనలతో వెంకటరెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని పశుపోషకులకు చేయూతగా నిలవడం హర్షనీయమని గ్రామ సర్పంచి భూపతి కిశోర్ ఈసందర్భంగా కొనియాడారు. వెంకటరెడ్డి తరఫున ఆయన సోదరుడు సుధీర్ పశుగ్రాసం పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం



రేపల్లెలో నులిపురుగుల నివారణ మాత్రలు అందజేస్తున్న ఎంఈఓ రత్నశ్రీధర్



నగరంలో విద్యార్థినికి ఆల్‌బెండాజోల్ టాబ్లెట్ వేస్తున్న బాబురావు, ఎంఈఓ వీరాంజనేయులు

రేపల్లె రూరల్: నులిపురుగులతో అనేక రోగాలు వస్తాయని మండల విద్యాశాఖ అధికారి రత్నశ్రీధర్ చెప్పారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని పురస్కరించుకుని పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సంవత్సరం వయస్సు నిండిన ప్రతిఒక్కరూ ఆరు నెలలకు ఒకసారి నులిపురుగు నివారణ మాత్రలను తీసుకోవచ్చన్నారు. కడుపులో నులిపురుగు ఏర్పడితే రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించటం వంటి అనార్థాలు వస్తాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ గిరికుమారి, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఏబీఆర్ కళాశాలలో..

పట్టణంలోని ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలను అందజేశారు. అదేవిధంగా పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలలో, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది నులిపురుగుల నివారణ మాత్రలను విద్యార్థులకు అందజేశారు.

భట్టిప్రోలులో...

భట్టిప్రోలు: జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం మంగళవారం మండలంలోని వెల్లటూరు, భట్టిప్రోలు పీహెచ్‌సీలు, సబ్ సెంటర్ల పరిధిలో జరిగింది. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులకు డీ వార్మింగ్ మాత్రలు (నులి పురుగుల నివారణ మాత్రలు- ఆల్బెండాజోల్) ఇచ్చారు. పెదపులివర్రు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి జాతీయ నులిపురుగుల నివారణ మాత్రలను అందచేశారు. హైస్కూల్ హెచ్ఎం బాషా, ఉపాధ్యాయులు, ఏఎన్ఎం లీలా రాణి, ఎంఎల్‌హెచ్‌పీ ఆశా జ్యోతి, ఆశాకార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వేమూరులో...

యడ్లపల్లి(వేమూరు): విద్యార్థులు నులిపురుగుల నివారణకు ఆల్‌బెండాజోల్ మాత్రలు తప్పనిసరిగా చప్పరించాలని యడ్లపల్లి మండల ప్రాథమిక వైద్యాధికారి ప్రేమచంద్ తెలిపారు. చుండూరు మండలంలోని యడ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం జాతీయ నులిపురుగుల దినోత్సవం నిర్వహించి, విద్యార్థులకు ఆల్‌బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు. సీహెచ్ఓ షేక్ వల్లీ, సూపర్ వైజర్లు, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నగరంలో...

నగరం: నులిపురుగుల నిర్మూలనకు ఆల్‌బెండాజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎస్.బాబురావు చెప్పారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఆల్‌బెండాజోల్ టాబ్లెట్ల పంపిణీ కార్యక్రమంలో బాబురావు పాల్గొని మాట్లాడారు. మండలంలో 5648 మంది పిల్లలుఉన్నారని వీరిలో 5426 మందికి టాబ్లెట్‌ను మింగించడం జరిగిందన్నారు. ఎంఈఓ వీరాంజనేయులు, ఉపాధ్యాయులు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ఆకస్మిక తనిఖీలు

91 కేసులు నమోదు



వివరాలు వెల్లడిస్తున్న తనిఖీ బృందం

నిజాంపట్నం: మండలంలో మంగళవారం విద్యుత్ విజిలెన్స్ విభాగం అధికారుల ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. బాపట్ల డివిజన్ పరిధిలోని విద్యుత్ సిబ్బంది 43 బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. 2403 గృహాలు, 128 వాణిజ్య, 147 ఆక్వా సర్వీసులు తనిఖీ చేసినట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో 3 సర్వీసులు విద్యుత్ చౌర్యం, 88 సర్వీసులు అనాధికారికంగా అదనపు లోడు వాడుతున్నట్లు గుర్తించి మొత్తం 91 కేసులు నమోదు చేసి రూ.6.18 లక్షలు అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌లు ఆంజనేయులు, కేవీఎల్ఎన్ మూర్తి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌లు విజయ్ శ్రీనివాస్, పీవీఆర్ మల్లికార్జునరావు, హరిప్రసాద్, శ్రీనివాసరావు, డివిజనల్ నేఈలు, విజిలెన్స్ ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

సినిమాపై కేబినెట్‌లో చర్చించటం అవసరం

- సబ్సిడీ పెంపుదల చేయాలి
- చలనచిత్ర అభివృద్ధి సంస్థను సాంస్కృతిక శాఖలో విలీనం చేయాలి
- మా-ఏపీ వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా

తెనాలి: రాష్ట్ర కేబినెట్ బుధవారం సమావేశమవుతున్న సందర్భంగా సినిమా పరిశ్రమపై ప్రతిపాదిత అంశాలపై చర్చించాల్సిందిగా మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. స్థానిక 'మా-ఏపీ' కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సినిమా పరిశ్రమ ఏపీలో అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు. రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి సంస్థను సమాచారశాఖ నుంచి విడతీసి పర్యాటక, సాంస్కృతిక శాఖల్లో విలీనం చేస్తే ప్రయోజనం ఉంటుందని అభిప్రాయపడ్డారు. సినిమా షూటింగ్ లోకేషన్లన్నీ టూరిజం శాఖ పరిధిలోనే ఉన్నందున అనుమతులకు కాలయాపన జరగదన్నారు. గతంలో ప్రకటించిన నంది అవార్డులను అందజేస్తూ ప్రస్తుత కాలానికి నంది అవార్డులను ప్రకటించాలని కోరారు. రాజకీయాలతో సంబంధంలేని వ్యక్తులను న్యాయనిర్ణేతల కమిటీలో నియమించాలని సూచించారు. కొన్ని రాష్ట్రాల్లో సబ్సిడీ రూ.50 లక్షలు చెల్లిస్తున్న నేపథ్యంలో పెరిగిన సినిమా నిర్మాణ వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని, ఆంధ్రలో సబ్సిడీని రూ.10 లక్షల్నుంచి రూ.50 లక్షలకు పెంచే దిశగా నిర్ణయం తీసుకోవాలని యూనియన్ తరఫున కోరారు. స్టూడియోల నిర్మాణం, పోస్ట్ ప్రొడక్షన్ యూనిట్ల ఏర్పాటుపైనా ఆలోచన చేయాలన్నారు. పర్యాటక, సాంస్కృతిక, ఎఫ్‌డీసీ శాఖల్లో ఖాళీలను భర్తీచేయాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యకరం



జీవామృతం తయారీపై రైతులకు వివరిస్తున్న విద్యార్థులు

వల్లభాపురం(కొల్లిపర): రైతులు ప్రకృతి సేద్యం ద్వారా పండిస్తే, తక్కువ పెట్టుబడితో పాటు అధిక దిగుబడులు సాధించటమే కాకుండా ఆహార ధాన్యాలు ఎంతో ఆరోగ్యకరంగా ఉంటాయని వడ్లమూడి విజ్ఞాన్ విశ్వవిద్యాలయం విద్యార్థినులు రైతులకు వివరించారు. వ్యవసాయ, ఉద్యాన విజ్ఞాన విభాగం ద్వారా 2024-25 గ్రామీణ అవగాహన అనుభవ కార్యక్రమంలో భాగంగా విజ్ఞాన్ విశ్వవిద్యాలయం విద్యార్థులు మంగళవారం మండలంలోని వల్లభాపురంలోని రైతులకు మొక్కల పెంపకానికి సహజ పద్ధతులు, ధ్రువ జీవామృతం తయారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పంట సాగు చేయడం వలన రసాయనాల వాడకం ఉండదని చెప్పారు. జీవామృతం కషాయాలపై రైతులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. వివిధ పంటలో చీడపీడల నివారణకు జీవామృతం వినియోగించాలని సూచించారు. ధ్రువ జీవామృతం పంటల్లో జీవన ఎరువుగా వాడాలని చెప్పారు. జీవామృతాన్ని పాలు, పెరుగు, వేరుశనగ, గోవు మూత్రం వంటి సహజ పదార్థాలతో రైతులు తమ ఇంటి వద్దనే ఏ విధంగా తయారు చేసుకోవాలని అన్న విషయాలను ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విశ్వవిద్యాలయం 4వ సంవత్సరం విద్యార్థినులు ఎస్.కావ్య శ్రీ, బీవీఎస్ కావ్య, బి.నక్షత, ఎ.మధులత, ఎం.లోకేశ్వరి, వై.శ్రీహిత, అజ్మీరా, జమేరియా, ఎల్.హేమ, వి.తేజశ్రీ, రైతులు అద్దంకి వెంకటరమణ, నాగిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

భట్టిప్రోలులో 'ప్లాంట్ ఫర్ మదర్'



భట్టిప్రోలు: పుట్టిన నేల కోసం ప్రతిఒక్కరూ ఒక మొక్క నాటాలనే ధ్యేయంతో పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమం కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర డిప్యూటీ సీఎం కె.పవన్ కల్యాణ్ ఆదేశానుసారం పంచాయతీరాజ్ కమిషనర్ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో మొక్కలు నాటారు. ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, ఏపీఓ పి. శివపార్వతి, టెక్నికల్ అసిస్టెంట్ పి.సుధీర్ కుమార్, ఈవోపీఆర్డీ టి.ఉషారాణి, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయంగా సుదర్శన హోమం

తెనాలి: స్థానిక షరాఫ్ బజార్‌లోని శ్రీసువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో వార్షిక పవిత్రోత్సవాలు, మహా సుదర్శనహోమం కార్యక్రమాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండోరోజైన మంగళవారం స్వామికి విశేష పూజలు, సుదర్శన హోమం, పవిత్ర ఆరోపణ, శాంతి హోమం నిర్వహించారు. బుధవారం పవిత్ర విసర్జన, పూర్ణాహుతి, తిరుప్పావడ సేవ పూజ జరుగుతాయని ఆలయ ఈఓ అవుతు శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని సూచించారు. శ్రీపంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం సభ్యులు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ, నిఖిల్ శాండిల్య, ఆలయ వంశ పారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాస మూర్తి, కిరణ్ కుమార్, సురేష్, సంకీర్తన సేవాసమితి సభ్యులు గుడివాడ బాలకృష్ణ, మూర్తి వెంకటేశ్వరరావు, జంధ్యం రామారావు, మడుపల్లి చంద్రశేఖర్, కె.రమణ కుమార్ పాల్గొన్నారు.

పెరియార్ చిరస్మరణీయుడు

తెనాలి: దేశంలో అణగారిన వర్గాల ప్రజలు ఆత్మగౌరవంతో జీవించేలా కృషి చేసిన పెరియార్ ఈవీ రామస్వామి నాయకర్ ప్రాతఃస్మరణీయుడుగా ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కొనియాడారు. పెరియార్ జయంతిని పురస్కరించకుని బుధవారం పెరియార్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు కుర్రా శ్రీను అధ్యక్షత వహించారు. పెరియార్ జీవిత విశేషాలను, అణగారిన వర్గాలకు చేసిన సేవలను స్మరించుకున్నారు. అణగారిన వర్గాలు తమ మధ్య ఐక్యతను పెంచుకోవడం ద్వారా మాత్రమే రాజ్యాధికారం సాధించుకోగలుగుతారని పెరియార్ స్పష్టంగా చెప్పారని గుర్తుచేశారు.

చోరీలకు పాల్పడుతున్న యువకుల అరెస్ట్

తెనాలిరూరల్: వరస చోరీలకు పాల్పడుతున్న యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో చోరీ కేసుల వివరాలను ఎస్ఐ షేక్ కరిముల్లా వివరించారు. వేర్వేరు కేసుల్లో నిందితులను అరెస్ట్ చేసి వీరి వద్ద నుంచి రూ. 2.80 లక్షల విలువ చేసే 45గ్రాముల బంగారం ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టణానికి చెందిన ఒడగల పార్థసారథి అలియాస్ పార్థు చోరీలు చేస్తుంటాడు. తన స్నేహితులు కూరపాటి సంపత్, ధనావత్ హనుమనాయక్‌లతో కలసి ఇటీవలి కాలంలో చోరీలకు పాల్పడుతున్నాడు. పట్టణ చినరావూరుకు చెందిన వెంకటవాసు జూలై 11వ తేదీన అర్ధరాత్రి సమయంలో బహిర్భూమికని బయటకు రాగా అతడిని బెదిరించి మెడలో ఉన్న రెండు బంగారు గొలుసులు, చేతికి ఉన్న రెండు ఉంగరాలను నిందితులు చోరీ చేసినట్లు తెలిపారు. అలానే నాజరుపేటకు చెందిన కాంతి శ్రీరామ్ ఇంట్లో నిద్రిస్తుండగా లోనికి ప్రవేశించిన వీరు బీరువాలో ఉన్న రెండు బుట్ట పోగులు అపహరించుకెళ్లారు. చెంచుపేట కెప్టెన్ యర్రంనేని విజయప్రసాద్ బజారులో వృద్ధురాలి ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఆయా ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితులను బుర్రిపాలెం రోడ్డులోని పాలాద్రి కాలువ వద్ద అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ కరిముల్లా తెలిపారు.

పేకాటరాయుళ్లు అరెస్ట్

కొల్లిపర: మండల కేంద్రమైన కొల్లిపర గ్రామంలో పొలాల్లో ఒక భవనంలో రహస్యంగా పేకాటాడుతున్న 8 మందిని ఎస్ఐ పి.కోటేశ్వరరావు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేకాటాడుతున్న 8 మంది వద్ద నుంచి రూ.15,220, 4 మోటార్ సైకిల్‌లు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారి వెంట నాగరాజు, తాతారావు ఉన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

కొల్లూరు: కృష్ణా వరదల కారణంగా పుస్తకాలు సైతం కోల్పోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులకు తమ వంతు సాయంగా ఎస్ఆర్ఐ వాకా రవి, కిష్కింధపాలెం వెల్ఫేర్ అసిస్టెంట్ పంతుల ఫణిగోపాల్, పొన్నపల్లి కల్యాణ్‌కుమార్‌లు స్వచ్ఛందంగా రూ. 42 వేలు సమకూర్చి విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. మండలంలోని కిష్కింధపాలెం, తోకలవారిపాలెం, గాజుల్లంక గ్రామాలలోని పాఠశాలల విద్యార్థులకు మంగళవారం పుస్తకాలు, ఇతర పరికరాలు అందజేయడంతో ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): మృతిచెందిన వారి అంతిమ సంస్కారాలకు చేయూతనందించటం అభినందనీయమని గాదె యువసేన బాపట్ల నియోజకవర్గం అధ్యక్షుడు దేగల రవిరెడ్డి తెలిపారు. పిట్టలవానిపాలెం గ్రామానికి చెందిన ముచ్చు సాంబిరెడ్డి గుండెపోటుతో మృతిచెందటంతో అతని అంత్యక్రియలకు గాదె యువసేన తరఫున దేగల రవిరెడ్డి మృతుని భార్యకు రూ.10వేల నగదు అందజేశారు. గాదె యువసేన సభ్యులు గోవతోటి విజయ్, తుమ్మా శివరెడ్డి, అలవల అశోక్‌రెడ్డి, పులుగు సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.